దస్తురాబాద్ : విద్యుద్దీపాలతో ముస్తాబైన గొడిసెర్యాల శ్రీ రాజరాజేశ్వర ఆలయం

శివపూజకు వేళాయె

- నేడు మహాశివరాత్రి
- ఊరూరా ముస్తాబైన శైవక్షేత్రాలు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీలు

మహాశివరాత్రి వేడుకలకు శైవక్షేత్రాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని శివాలయాలు విద్యుద్దీపాల వెలుగులో కాంతులీనుతున్నాయి. ఆయాచోట్ల అంగరంగ వైభవంగా జరిగే శివ పార్వతుల కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు వేలాదిగా తరలివస్తుండగా, కమిటీలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఉపవాస దీక్షలతో రాత్రంతా జాగరణ చేసి స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. –నెట్‌వర్క్

సిరికొండలో డాట్రా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు(ఫైల్)

సర్వే డబ్బులేవి?

నాలుగు నెలలు గడిచినా అందని పారితోషికం

ఎదురు చూస్తున్న సర్వే, డేటా ఆపరేటర్లు

ఇచ్చోడ, ఫిబ్రవరి 25 : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్‌లు పెంచాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కుల సమగ్ర ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టింది. మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు, బిల్ కలెక్టర్‌లు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, సీవోలను ఎన్యూమరేటర్లుగా నియమించారు. గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్ అధ్యాపకులు, ఎంఆర్‌సీ సిబ్బందిని ఎన్యూమరేటర్లుగా నియమించారు. వీరంతా గత నవంబర్ 9 నుంచి 24వ తేదీ వరకు తమకు కేటాయించిన సంఖ్యకు అనుగుణంగా ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. ఆయా కుటుంబాల సమాచారాన్ని ప్రత్యేక ఫాంలో నమోదు చేశారు. ఈ సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు మండలస్థాయి అధికారులను సూపర్ వైజర్లుగా నియమించారు. ఎన్యూమరేటర్లు చేసిన వివరాలను పరిశీలించి రోజువారీగా జరిగిన సర్వే వివరాలను సూపర్‌వైజర్లు ఉన్నతాధికారులకు నివేదించారు. అలాగే సర్వే వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేసేందుకు డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించారు.

నాలుగుగా పెండింగ్‌లో పారితోషికాలు

సర్వే నిర్వహించిన ఎన్యూమరేటర్‌కు రూ.10 వేలు, సూపర్ వైజర్‌కు రూ.12వేలు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒక్కో ఫారం నమోదు చేసినందుకు రూ.25 చొప్పున చెల్లించాలని నిర్ణయించింది. ఈ సర్వే ప్రారంభానికి మందే ప్రభుత్వం జిల్లాకు రూ.2.37 కోట్లు మంజూరు చేసింది. సర్వే ఫాం ముద్రణ నుంచి పారితోషికాలు చెల్లింపు వరకు ఈ నిధులు వినియోగించాలని సూచించింది. అయితే సర్వేతోపాటు డాటా ఎంట్రీ ప్రక్రియ ముగిసి నెలలు దాటినా జిల్లాలో వాటి చెల్లింపులు జరగలేదు. దీంతో తమకు పారితోషికాలు ఎప్పుడు అందుతాయా? అని ఎన్యూమరేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఎదురుచూస్తున్నారు. వాటిని త్వరగా చెల్లించేలా చూడాలని ఉన్నతాధికారులను వారు కోరుతున్నారు.

నాలుగు నెలలు అవుతుంది..

కుటుంబ సర్వే డాటా ఎంట్రీ చేసి నాలుగు నెలలు అయ్యాయి. ఇంత వరకు అధికారులు డాటా ఎంట్రీ పారితోషికాలు జమ చేయలేదు. ఇతర జిల్లాల్లో జమ అయినట్లు మాకు సమాచారం ఉంది. మన జిల్లాలో జమ కాలేదు. త్వరగా పారితోషికాన్ని జమ చేయాలి. డాటా ఎంట్రీ రాత్రి, పగలు కష్టపడి గడువులోపు ఆన్‌లైన్ చేశాం. నాలుగు నెలలైన డబ్బులు అందడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పారితోషికాలు మా ఖాతాల్లో జమ చేయాలి.

- బొడ్డు సాయికుమార్, డాటా ఆపరేటర్, సిరికొండ.

రేపు మాపు అంటున్నారు..

ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను మాకు కేటాయించిన ఇండ్లను సర్వే ఫారాల్లో నమోదు చేశాం. ఎన్యూమరేటర్లకు సర్వే పూర్తి చేస్తే రూ.10 వేలు అందజేస్తామని అధికారులు తెలిపారు. నాలుగు నెలలు గడిచినా ఎన్యూమరేటర్లకు బ్యాంకులో డబ్బులు జమ కాలేదు. అధికారులను అడిగితే ఇయ్యాళ్ల రేపు అంటూ నాలుగు నెలలు వెళ్లదీశారు. అధికారులు వెంటనే స్పందించి మా పారితోషికాలు త్వరగా చెల్లించాలి.

- పూర్ణ చందర్, ఎన్యూమరేటర్, ఆదిలాబాద్ అర్బన్

కుటుంబ సర్వే నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లు

త్వరలో జమ

సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన నిధులు ట్రెజరీలో పెండింగ్‌లో ఉన్నాయి. వాటి చెల్లింపుల కోసం ట్రెజరీ నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు ఇది వరకే టోకెన్ తీసుకున్నారు. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్ల పారితోషికాలతో పాటు డాటా ఎంట్రీ ఆపరేటర్ల పారితోషికాల బిల్లులన్నింటిని ట్రెజరీకి పంపించాం. సోమవారం బ్యాంకు ఖాతాల్లో జమయ్యే అవకాశం ఉంది. సర్వే సిబ్బంది ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- వెంకటరమణ, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి

ఆదిలాబాద్ జిల్లాలోని సర్వే వివరాలు..

గ్రామ పంచాయతీలు	473
మున్సిపాలిటీలోని వార్డులు	49
ఎన్యూమరేటర్లు	2,186
సూపర్‌వైజర్లు	174
డాటా ఎంట్రీ ఆపరేటర్లు	412



- ప్రైవేట్ వ్యక్తులకు మొబైల్ నంబర్లు వెళ్లడంపై గ్రాడ్యుయేట్ల ఆగ్రహం
- ఎమ్మెల్సీ ఎన్నికల పచారంతో ఓటర్లకు చుక్కలు

ఎమ్మెల్సీ అభ్యర్థి నుంచి వచ్చిన ఫోన్ కాల్

ఒకటే కాల్స్..

ఉదయం నుంచి రాత్రి వరకు పదేపదే ఫోన్స్, మెస్సేజ్‌లు

ఇచ్చోడ, ఫిబ్రవరి 25 : 'హలో నేను మీ గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిని. ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటు నాకే వేయండి. బ్యాలెట్ పేపర్‌లో నా నంబర్‌పై మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి..' అంటూ రోజూ ఉదయం నుంచి రాత్రి దాకా పదుల సంఖ్యలో గ్రాడ్యుయేట్, టీచర్ ఓటర్లకు కాల్స్, మెస్సేజ్‌లు వస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రధానంగా సోషల్ మీడియాలో క్యాంపెయిన్‌పై ఫోకస్ పెట్టారు. అభ్యర్థుల నుంచి ఓటర్లకు వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ద్వారానే కాకుండా నేరుగా ఫోన్ కాల్స్ వస్తున్నాయి. దీంతో పోటీ చేసిన అభ్యర్థుల నుంచి కాల్స్ వస్తుండడంతో ఓటర్లు చుక్కలు చూస్తున్నారు. ఏ అభ్యర్థికి ఫోన్ నంబర్ ఇవ్వలేదని.. ఇలా కాల్స్ చేయడం ఏంటని పలువురు ఓటర్లు ప్రశ్నిస్తూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గోప్యంగా ఉంచాల్సిందిపోయి..

ఓటర్లు విద్యావంతులే అయినా వారి అనుమతి లేకుండా ప్రైవేట్ వ్యక్తులకు ఫోన్ నంబర్లు వెళ్లడంతో ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి నాలుగు జిల్లాల్లో 3.59 లక్షల మంది గ్రాడ్యుయేట్, 28 వేల మంది టీచర్ ఓటర్లు ఉన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు సమయంలో ఫోన్ నంబర్లను ఎలక్షన్ వెబ్‌సైట్‌తోపాటు ఆఫ్ లైన్‌లో మాన్యువల్‌గా ఇచ్చారు. అయితే.. అధికారికంగా నంబర్ గోప్యంగా ఉంచాలి. ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా వివిధ వ్యాపార ప్రకటనలు, ఇతరత్రా అవసరాల కోసం వాడుకునే అవకాశం లేకపోలేదనే అనుమానిస్తున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ అభ్యర్థులు ప్రచార కాల్స్ కొందరు ఓటర్లు బ్లాక్ చేస్తున్నప్పటికీ వేర్వేరు నంబర్లతో పదే పదే కాల్స్ వస్తుండడంతో లిఫ్ట్ చేయకపోవడమే మంచిదని కూడా వదిలేస్తున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి నుంచి వచ్చిన మేసేజ్

ఫోన్ నంబర్లను గోప్యంగా ఉంచాలి..

ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి రోజు 10 నుంచి 15 ఫోన్ కాల్స్ వస్తున్నాయి. రోజుకు 5 నుంచి 10 వరకు మేస్సేజ్‌లు ఉంటున్నాయి. మా నంబర్‌లు ఓటర్ వెబ్‌సైట్ ఉంచాలి. కానీ.. ప్రైవేట్ వ్యక్తులకు వెళ్లడంతో ఆందోళనకు గురి చేసుంది. నంబర్ బ్లాక్ లిస్టులో పెట్టినా వేరే నంబర్ నుంచి ఫోన్‌లు వస్తున్నాయి.

- లకావత్ రమేశ్, ఉపాధ్యాయుడు, పొన్న

ఉదయం నుంచి రాత్రి వరకు ఫోన్‌లు

ఉదయం నుంచి రాత్రి వరకు ఎమ్మెల్సీ అభ్యర్థుల నుంచి ఫోన్‌లు వస్తున్నాయి. ఏ ఫోన్ అవసరమైందో ఏదీ ఎమ్మెల్సీ ఫోనో తెలియడం లేదు. రోజు 20 ఫోన్‌లు రావడంతో ఏ పని చేయలేకపోతున్నాం. ఈ ఫోన్‌లతో చాలా ఇబ్బంది పడుతున్నాం. ముఖ్యమైన ఫోన్ వస్తే లేపలేకపోతున్నాం. ఫోన్ నంబర్‌లను ప్రైవేట్ వ్యక్తుల చేతులకు వెళ్లడం ఆందోళనకు గురి చేస్తున్నది.

- అవుల రాజేశ్, పట్టభద్రుడు, సిరికొండ

కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, ఫిబ్రవరి 25 : బ్యాంక్‌ల ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తే మహిళలు ఆర్థిక, సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ వరకు నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం 2 కే రన్‌ను నిర్వహించారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో కలెక్టర్ క్రీడాజ్యోతి వెలిగించి జెండాఊపి రన్‌ను ప్రారంభించారు. వారితో కలిసి రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించేలా ఆర్బీఐ ఆధ్వర్యంలో వారోత్సవాలను నిర్వహిస్తున్నారన్నారు. బ్యాంకర్లు కూడా మహిళలకు రుణాలు ఇచ్చేలా ప్రణాళికలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

సదరం సర్టిఫికెట్లు జారీ చేసేలా చర్యలు..

సదరం సర్టిఫికెట్లలో ప్రభుత్వం మరో 21 అంశాలను జోడించిందని, దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా సర్టిఫికెట్లను జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం రిమ్స్‌లోని సదరం క్యాంప్ కార్యాలయంతో పాటు శిబిరం నిర్వహించడానికి స్థలాన్ని పరిశీలించారు. అంతకు ముందు గతంలో సదరం సర్టిఫికెట్ల జారీ, పెండింగ్‌లో ఉన్న వాటి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. గతంలో కేవలం 6, 7 రకాల దివ్యాంగులకు మాత్రమే సర్టిఫికెట్లను అందించే వారన్నారు. ఇప్పుడు ప్రభుత్వం 21 రకాల వ్యాధుల దివ్యాంగులకు సర్టిఫికెట్లను అందించేలా ప్రణాళికలు చేసిందన్నారు. త్వరలో ఆయా విభాగాల వైద్యులతో సదరం శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్, డీఆర్డీవో రవీందర్ రాథోడ్, ఏసీడీవో మిల్కి, రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, డీపీఆర్ తిరుమల పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవితో కలిసి సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మార్చి నెల 5వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలు రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఇంటర్ పరీక్షలకు 18,880 మంది విద్యార్థులు హాజరు కానుండగా, 31 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సమీక్షా సమావేశంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీఐఈవో రవీందర్, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత, పరీక్షల విభాగం గణేశ్, ధన్‌రాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాయం అందిస్తే మహిళాభివృద్ధి సాధ్యం

జెండాఊపి 2 కే రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఓటరు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 25 : ఎమ్మెల్సీ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎన్నికల్లో భాగంగా విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది, ఇతరులకు ఆర్డీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలను రెండు రోజులపాటు నిర్వహించారు. నిర్మల్ జిల్లాలో 131 మంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోగా.. ఇతర జిల్లాలకు చెందిన 22 మంది దరఖాస్తు చేసుకుని ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త పాటించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్, ఫిబ్రవరి 25 : ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది జాగ్రత్తలు పాటించాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. మంగళవారం స్థానిక కుమ్రం భీం ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాల పరిధిలో గల ఆశ్రమాల్లో పని చేస్తున్న ఏఎన్ఎంలు, వైద్యసిబ్బందికి ఓరియంటేషన్ ట్రెయినింగ్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏఎన్ఎంలకు నియమించబడిన ప్రాంతాల్లోనే నివాసం ఉండాలన్నారు. అనారోగ్యంతో ఉన్న విద్యార్థులను సమీపంలోని హెల్త్ సెంటర్, పీహెచ్‌సీలకు తీసుకెళ్లి రక్తపరీక్షలు, బ్లెడ్ ప్లెజర్, పల్స్ రేట్‌లను పరీక్షించి వైద్యుల సలహాతో సిక్ గదులలో ఉంచి పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో డీడీ ఎర్రయ్య, ఏజెన్సీ అదనపు వైద్యాధికారి మనోహర్ పాల్గొన్నారు.

పంట నాణ్యతను పరిశీలిస్తున్న సీసీఐ సిబ్బంది

ఎన్నాళ్లో అవస్థలు

పత్తి కొనుగోళ్లలో సీసీఐ నిర్లక్ష్యం

- తేమ, పంట నాణ్యత పేరిట తిరస్కరణ
- ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి నష్టపోతున్న రైతులు

ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి లోడ్ వాహనాలు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 25(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తిని అమ్ముకునేందుకు రైతులు కొనుగోళ్లు ప్రారంభమైనప్పటి నుంచి ఇబ్బందులు పడుతున్నారు. అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) అధికారులు విధిస్తున్న నిబంధనలకు రైతుల పాలిట శాపంగా మారాయి. అన్నదాతలకు అండగా నిలువాల్సిన సీసీఐ కార్పొరేట్ కంపెనీలా వ్యవహరిస్తూ నష్టాలకు గురి చేస్తుండడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నారు. ఆదిలాబాద్ మార్కెట్‌లో తప్ప ఎక్కడా సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోళ్లు జరగడం లేదు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండడంతో రైతులు పత్తిని విక్రయించడానికి వాహనాల్లో పంటను ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తీసుకొస్తున్నారు.

తేమ, నాణ్యత పేరిట తిరస్కరణ

పత్తి ప్రారంభంలో సీసీఐ అధికారులు పంటలో తేమ ఎక్కువ ఉందని కొనుగోళ్లకు నిరాకరించారు. దీంతో రైతులు తక్కువ ధరకు ప్రైవేటు వ్యాపారులకు పత్తిని విక్రయించి నష్టపోయారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.7521 ఉండగా.. పంట నాణ్యత సరిగా లేదంటూ సీసీఐ అధికారులు రూ.100 తగ్గించి క్వింటాలుకు రూ.7421తో కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు క్వింటాలుకు రూ.100 నష్టపోవాల్సి వస్తుంది. సీసీఐ కొనుగోళ్లు సర్వర్ సమస్య కారణంగా పది రోజులు నిలిచిపోగా ఇటీవల ప్రారంభమయ్యాయి. దీంతో రైతులు పెద్ద మొత్తంలో పత్తిని సీసీఐకి అమ్మడానికి ఆదిలాబాద్ మార్కెట్‌యార్డుకు తీసుకొస్తున్నారు. విక్రయాలు చివరి దశకు చేరుకోగా సీసీఐ అధికారులు ఇప్పటికీ పంటలో తేమ ఉందంటూ కొనుగోళ్లు చేయడం లేదు. దీంతోపాటు నాణ్యత సరిగా లేదంటూ తిరస్కరిస్తున్నారు. దీంతో గంపెడాశతో పత్తిని సీసీఐకి అమ్ముకుని మద్దతు ధర పొందుతామనుకున్న రైతులకు నిరాశే మిగులుతుంది. మంగళవారం ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో పలువురు రైతులు తీసుకొచ్చిన పంటను సీసీఐ సిబ్బంది తేమ, నాణ్యత పేరిట తిరస్కరించారు. దీంతో రైతులు చేసేదేమీ లేక తక్కువ ధరకు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించారు.

తేమ ఉందని కొనుగోలు చేయడం లేదు..

బేల, జైనథ్ మండలాల్లో సీసీఐ కొనుగోళ్లు లేకపోవడంతో నేను 30 క్వింటాళ్ల పత్తిని విక్రయించడానికి ట్రాక్టర్‌లో తీసుకొచ్చా. నాణ్యత బాగా ఉన్న తేమ ఎక్కువ ఉందంటూ సీసీఐ సిబ్బంది కొనుగోలు చేయడానికి తిరస్కరించారు. జిల్లాలో కొన్ని రోజులుగా 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో పంటలో తేమ ఉండే అవకాశాలు లేవు. ఈ విషయం సీసీఐ అధికారులకు చెప్పినా వినిపించుకోవడం లేదు. సీసీఐ సిబ్బంది పంటను కొనుగోలు చేయడానికి నిరాకరిస్తుండడంతో ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి నష్టపోవాల్సి వస్తుంది.

- రవుత్ శ్యాంసుందర్, రైతు, పిడ్గాం, బేల మండలం